**కథ**

# స్పందించే హృదయం

**నామని సుజనాదేవి**

**కేక్‌ముందు కూర్చున్న పిల్లలు గోల చేస్తున్నారు, ఏడు గంటలకి వస్తానన్న తండ్రి శివరాం ఎనిమిదయినా రాలేదని. వారిని చిరునవ్వుతో సముదాయిస్తున్నా ఇంకా రాని భర్తపై శిరీషకి కూడా కోపంగానే ఉంది. కనీసం పిల్లల బర్త్‌డే రోజయినా తొందరగా రమ్మని మరీ మరీ చెప్పింది. ఇంకా రాలేదు. ఆఫీస్‌కి ఫోన్ చేస్తే ఎప్పుడో బయల్దేరారని చెప్పారు. ఇంకా రాకపోయేసరికి ఆందోళన..భయం..దారిలో ఏమైనా జరిగిందేమోనని.**

అసలే ఈరోజుల్లో ఏ క్షణం ఏమవుతుందో తెలీదు. యాక్సిడెంట్‌లు విపరీతంగా పెరిగిపోయాయి. మన తప్పు ఉన్నా లేకున్నా ఎవరిది తప్పయినా ఫలితం మాత్రం అనుభవించాల్సి వస్తుంది. ఒకవేళ ఏదైనా జరగరానిది జరిగిందా..అందుకనే రాలేదా..తలుచుకుంటే గుండె ఝుల్లుమంది శిరీషకి. 'భగవంతుడా! చీమకి కూడా హాని తలపెట్టని వాళ్ళం..అందరికీ మంచి జరగాలని కాంక్షించే వాళ్ళం. ఎవరినీ ఒక్కమాట కూడా కరుకుగా అననివారు. తండ్రీ! వేంకటేశ్వరస్వామీ! నీదే భారం తండ్రీ..ఎటువంటి ఆపద రాకుండా చూడు తండ్రీ!' అనుకుంది.

"అమ్మా..అమ్మా..మా ఫ్రెండ్స్ రాత్రయింది, వెళతామంటున్నారు. నాన్నింకా రాలేదు" ఫిర్యాదుగా అంటున్న చిన్ను పిలుపుతో ఈ లోకంలోకొచ్చి నవ్వు పులుముకుని, 'పద' మంటూ వాడితో 'కేక్' కట్ చేయించింది శిరీష. పెద్దవాళ్ళెవరినీ పిలవలేదు పుట్టినరోజుకి. అంతా చిన్నపిల్లలే కావటంతో అందరితో చప్పట్లు కొట్టిస్తూ, గ్రీటింగ్స్ చెప్పించి, కేక్ ముక్కలు కోసి పిల్లలందరికీ పేపర్ ప్లేట్స్‌లో కేక్, స్వీట్, హాట్, చాక్లెట్స్ పంచింది. అవి తిని పిల్లలంతా వెళ్ళగానే 'నాన్న' అంటూ కలవరిస్తున్న పాపను, చిన్నును సముదాయించి తినిపించి పడుకోబెట్టింది శిరీష.

ఇదంతా చేస్తున్నా మనసంతా గజిబిజిగా, అన్యమనస్కంగానే ఉంది శిరీషకి. ఆఫీసులో లేకుండా ఇంటికి రాకుండా ఎటెళ్ళినట్లు. ఆఫీస్‌కాగానే ఇంటికే వస్తారెప్పుడూ. ఫ్రెండ్సంటూ..ఎటూ వెళ్ళేమనిషి కాదు. ఒకవేళ ఎటయినా వెళితే కనీసం ఫోనయినా చేస్తారు తాను కంగారుపడుతుందని. అన్నీ పిచ్చి పిచ్చి ఆలోచనలొస్తుంటే కళ్ళల్లో నీళ్ళు తిరిగి, వద్దనుకున్నా దుఃఖం ఉప్పెనలా ముంచుకొస్తోంది. ఏదైనా ఆక్సిడెంట్ జరిగినా..ఎవరైనా చూసి హాస్పిటల్‌లో చేర్చి అడ్రస్ కనుక్కుని ఫోన్ చేయాలంటే ఆలస్యం అవుతుంది కదా! అందుకనే ఏమీ తెలియడం లేదా! పరిపరి విధాల ఆలోచనలతో ఏమీ తోచడం లేదు. ఎవరి సహాయమన్నా తీసుకుందామనుకున్నా ఎవరైనా ఏం చేస్తారు అటువైపునుంచి ఏదైనా సమాచారం తెలిసేంతవరకూ ఏమీ చేయలేము. పైగా ఇంత రాత్రి వారిని గాభరా పెట్టినట్లవుతుంది. ఒకసారి మళ్ళీ దేవుడి గదికెళ్ళి మనస్ఫూర్తిగా మొక్కి, బొట్టు పెట్టుకుని వచ్చి ఫోన్ దగ్గరే కూర్చుంది. ఫోన్ మ్రోగగానే ఆత్రంగా అందుకుంది. కానీ ఆయన కాదు తన ఫ్రెండ్. ఏదో మాట్లాడి పెట్టేసింది. కాస్సేపటికి మళ్ళీ ఫోన్. ఊహించినట్లుగా ఈసారి అది శివరాం ఫోన్. మనసు ఒక్కసారి కుదుటపడినా కోపం, దుఃఖం మిళితమైన కంఠం, ఇంతసేపు తాననుభవించిన బాధను వెళ్ళగ్రక్కింది.

"ఏంటీ..ఇంతసేపు ఎక్కడున్నారు? నేనిక్కడెంత టెన్షన్ పడుతున్నానో తెలుసా?" అంటూ ఫోన్‌లో దాదాపు అరచినట్లే అడిగింది.

"శిరీ..ఆవేశపడకు. నాకేం కాలేదు. నే బాగానే ఉన్నాను. నువ్వేం కంగారుపడకు. ఒక గంటలో ఇంటికొస్తాను" అంటున్నాడు శివరాం.

"ఇంతకీ ఎక్కడున్నారు? ఏం జరిగింది? ఏం ప్రాబ్లమ్ లేదు కదా?" కుదుటపడ్డ మనసు ఆరాలు తీసింది.

"ఏం లేదు..జయ హాస్పిటల్‌లో ఉన్నాను. నాకేం కాలేదు..బాగానే ఉన్నాను. దారిలో ఎవరికో యాక్సిడెంట్ అయితే వారిని జాయిన్ చేస్తున్నాను. వచ్చేస్తాను. ఆలస్యం అయినా కంగారుపడకు. వచ్చాక అన్ని విషయాలు చెబుతాను. నువ్వు అన్నం తినేసేయి. ఉంటాను. బై" అంటూ ఫోన్ పెట్టేసాడు.

ఇందాకటి ఆదుర్దా కాస్త తగ్గినా అన్నీ సమాధానం లేని ప్రశ్నలే. హాస్పిటల్‌లో ఇంకా ఈయనెందుకున్నారు? ఏక్సిడెంట్ ఎవరు చేసారు? ఎవరికో అన్నారంటే వారికి తెలిసినవారు కాదన్నమాట. అయినా ఆయనెందుకున్నారూ...అంటే..ఆ ప్రశ్నకి జవాబు మాత్రం తనకు తెలుసు.

తనకు తెలిసినప్పటినుండీ ఆయనది ఆడవాళ్ళకన్నా చాలా సున్నితమైన హృదయం. సినిమా చూస్తుంటే కూడా అది సినిమా అని తెలిసినా కళ్ళల్లోకి నీళ్ళు వచ్చేవి ఆయనకు. అక్కలు, చెల్లెళ్ళు, అన్నయ్యలు, వాళ్ళ పిల్లలు అంతా.."అరెరె..అది సినిమా..అది చూసి ఏడుస్తారా..చిన్నపిల్లల్లా..ఛ...ఛ..ఛ" అంటూ ఆటపట్టించినా "ఎందుకో తట్టుకోలేకపోయానర్రా ఆ కష్టాలకి" అనేవారు. అమ్మా, అక్కా చెల్లెళ్ళందరూ, తనను "నిజంగా మీ ఆయనెంత బంగారమే. తెల్లవారి లేచి ఆయన కాళ్ళు కడిగి నెత్తిమీద పోసుకోవచ్చు. ఒకరి కన్నీళ్ళకే అలా కరిగిపోయే మనిషి ఇంక నిన్నేం కష్టపెడతాడు. నువ్వేదయినా కావాలని, కాస్తంత ఏడిస్తే చాలు క్షణాల్లో నీ ముందుంటుంది. నీ బాధ చూసి ఆయన తట్టుకోలేడుగా" అంటూ ఆటపట్టించేవారు. "బంగారం లాంటి ఆయనుండగా..ఇంకేదైనా నాకెందుకు" అనేది తను. ఎవరికి ఏ చిన్న బాధ అయినా తనకే జరిగినట్లు బాధపడేవారు. పత్రికల్లో ఎవరివైనా దీనగాథలు చదివితే చాలు "చూసావా శిరీ..పాపం..వాళ్ళు అలా అనాథల్లా తల్లిదండ్రులు లేకుండా ఎలా బ్రతుకుతారు? చిదిమితే పాలుగారే బుగ్గలున్న ఆ చిన్నారులు ఏం పని చేస్తారు. పాపం ఇల్లు కూలి, వారి తల్లిదండ్రులను పొట్టనపెట్టుకుని విధి వారికెంత కష్టం తెచ్చింది. మనమేమైనా సాయం చేద్దాం" అనేవారు. "అబ్బా పోనిద్దురూ..బాగా ఉన్నవాళ్ళెవరైనా చూసుకుంటార్లెద్దూ..ప్రభుత్వం హాస్టల్‌లో చేర్చుకుంటారన్నారుగా. మన బాధలు..మన ఇబ్బందులు మనకున్నాయిగా" అని తానంటే.."మన చేతనయినంతనే సాయం చేద్దాం లెద్దూ" అంటూ ఎంతో కొంత సాయం చేసేవారు. గుడికి వెళ్ళినా అంతే..గుళ్ళో హుండీలో వేసినా వేయకపోయినా, ముసలివాళ్ళకి, అవిటి బిచ్చగాళ్ళకి ఇలాంటి వాళ్ళకి దండిగా ఖర్చుపెట్టేవాడు. తినటానికి తీస్కెళ్ళిన తినుబండారాలు కూడా పంచేవారు.

అనాథ పిల్లలకని, భూకంప బాధితులు, తుపాను బాధితుల సహాయార్థం అంటూ ఎవరైనా వస్తే..అందరికన్నా ఈయన చేయేం ఎక్కువగా ఉండేది. పైగా "చూసావా శిరీ..అక్కడ తుపానయితే..ఈ మాత్రం వర్షం చలికే మనమింతలా వణికిపోతున్నాం పాపం..టీవీలో చూడు, కొంప, గోడు అంతా నీళ్ళలో మునిగి ఇళ్ళపైన అలా గంటల తరబడి చిన్నపిల్లలతో వాళ్ళెంత బాధపడుతున్నారో కదా" అనేవారు.

పిల్లల కొత్త డ్రెస్‌లు కాస్తంత చిన్నగా అయ్యాయి, మళ్ళీ పొడుగు చేద్దామనుకుంటే చాలు.."ఎందుకు లెద్దూ..శ్రమ..పనిమనిషి పిల్లలకిచ్చేద్దాం..సంతోషపడతారు" అనేవారు. ఒక్కోసారి ఆయన అతి జాలితనాన్ని ఇతరులు ఆసరా తీసుకుని మోసపుచ్చినప్పుడు తనకి కోపం వచ్చేది. చిరాకేసేది. కోపంగా అరిచేది. దానికి తేలిగ్గా నవ్వేస్తూ "ఎందుకంత కోపం శిరీ..కోపంలో అయినా నువ్వెంత అందంగా ఉన్నావో ఈ అద్దంలో చూడు" అంటూ వెంట వెంట తిరుగుతూ కోపం చల్లార్చేవాడు. "ఎందుకు శిరీ..ఆ భగవంతుడు లేడా..ఎవరే అబద్ధం

చెప్పినా, మోసం చేసినా..అన్నీ ఆయనే చూస్తారు. మనమేమైనా అన్నీ కట్టుకెళ్తామా పోయినప్పుడు..చెప్పు" అంటుంటే తనపై తనకే కోపం వచ్చేది. "సారీనండి..మీపై అంతలా అరిచాను. అయినా మీకింత సహనం ఎలా వచ్చిందో చెప్పరూ..నేర్చుకుంటాను" అనేది గోముగా.

"సహవాస లాభమోయ్..తెలీదా.." అంటూ రిటార్టిచ్చేవారు. అలా ఆలోచనల్లో మునిగినదల్లా, తలుపు చప్పుడు కావటంతో, ఆలోచనల నుండి తేరుకుని గబగబా వెళ్ళి తలుపు తీసింది శిరీష.


శివరాంనే..ఆటోలో వచ్చాడు ఇంటికి. నీరసంగా ఉన్నాడు. షర్టంతా రక్తం మరకలు. "ఏం జరిగిందండీ..స్కూటర్ ఏమయ్యింది.. ఈ మరకలేంటి?" అంటూ అతన్ని లోనికి తీసుకొస్తూ ఆదుర్దాగా ప్రశ్నించింది శిరీష.

"ఏం లేదు. గాబరా పడకు. పిల్లలు పడుకున్నారా? బర్త్‌డే బాగా జరిగిందా?" అంటూ మంచంపై పడుకుని అలసటగా కళ్ళు మూసుకున్నాడు శివరాం.


"అంతా బాగానే జరిగింది గానీ విషయం చెప్పండి" అంది షూస్ విడుస్తూ శిరీష.

"ఓపిక లేదు" అని ఆయన అంటుంటే, తన ఆత్రానికి, ఆదుర్దాకి తిట్టుకుంటూ, లోనికెళ్ళి వేణ్ణీళ్ళు తీసుకొచ్చి, బాత్రూం దగ్గరకు శివరాంను తీసుకెళ్ళి మొహం కడిగి, డ్రెస్ విడిపించి కాళ్ళు, చేతులు కడిగించి టవల్‌తో తుడిచి పొడిబట్టలు కట్టబెట్టి, మంచంపై పడుకోబెట్టి, అన్నం కలుపుకుని వచ్చి, తినిపిస్తుంటే, "నువ్వు తినలేదు కదూ..నువ్వూ తిను" అన్నాడు. "తింటాను లెండి" అంటూ పళ్ళెం లోపల పెట్టి, చేతులు తుడుచుకుంటూ "ఇప్పుడు చెప్పండి" అంది ఆత్రుతగా శిరీష.

"మరేం లేదోయ్..ఇంటికి వస్తుంటే దార్లో రోడ్‌పైనే యాక్సిడెంట్ జరిగింది. స్కూటరిస్ట్‌ను ఎవరో గుద్ది వెళ్ళిపోయారు. ఆ రోడ్‌లో జనసంచారం ఎక్కువగా ఉండరు కనుక ఎవరు గుద్దిందీ తెలీదు. పైగా అప్పుడే జరిగినట్లుంది. అంతా రక్తం. అంతా చూస్తూ వెళ్తున్నారుగానీ, ఎవరూ ఆగి, అతన్ని తీస్కెళ్ళటం లేదు. బాబు బర్త్‌డే అయినా నాకూ అలాగే చూస్తూ రావటానికి మనస్కరించలేదు. ఆగి ముక్కు దగ్గర వేలు పెట్టి చూసాను. శ్వాస ఆడుతోంది. వెంటనే స్కూటర్‌పై కాస్తంత దూరం వెళ్ళి, ఒక ఆటోను తీసుకు వచ్చి, స్కూటర్ అక్కడే ఓ పక్కగా పెట్టి తాళం వేసి, ఆటోలో అతన్ని పట్టుకుని 'జయ హాస్పిటల్'కి తీసుకెళ్ళాను. అది పోలీస్ కేస్ అవుతుందని, ముందు డాక్టర్స్ తీసుకోమన్నారు. ఇంకా ఆలస్యం చేస్తే అతని ప్రాణం పోయేలా ఉంది. ఏం చట్టాలో..ఏమిటో..అందులో నాకు తెలిసిన డాక్టర్ ఉండటంతో, అతనితో విషయం చెప్పి..ఎలాగైనా తీసుకోండి..అంటూ రిక్వెస్ట్ చేసాను. నా దగ్గర ఉన్న డబ్బు ముందర కట్టి, మిగతాది తర్వాత ఇస్తానంటూ రిక్వెస్ట్ చేసాను. జాయిన్ చేసుకున్నాక, అతని జేబులో దొరికిన ఐడెంటిటీ కార్డ్‌ని బట్టి, అందులోని ఫోన్ నెంబర్‌కి ఫోన్ చేస్తే వాళ్ళొచ్చారు. ఏ.పి.ఎస్.ఇ.బి.లో ఆఫీసర్ అతను.



డాక్టర్లు 'మరికాసేపాగితే రక్తం బాగా పోయి బ్రతికించలేకపోయేవాళ్ళం. సరిగ్గా సమయానికి తీసుకొచ్చారు. ఇప్పుడు ప్రాణాపాయం నుండి బయటపడ్డాడు' అన్నారు. ఊపిరి పీల్చుకున్నాను. చాలా సంతోషం వేసింది. నేను కూడా నాకెందుకంటూ వెళితే, ఒక నిండు ప్రాణం పోయేది. బర్త్‌డేలు మళ్ళీ జరుపుకోవచ్చు. కానీ పోయిన ప్రాణం వస్తుందా? అన్పించింది. ఎంతో సంతృప్తిగా అన్పించింది. బ్లడ్ కూడా సమయానికి లేదు. ఎవరిదీ మాచ్ కాలేదు. కానీ నాది సరిపోవటంతో నాదే ఇచ్చాను. కానీ మొదట వచ్చిన ఆయన భార్య, పిల్లలు 'మీరే లేకపోతే ఆయన ప్రాణం ఉండేది కాదు. మీరు దేవుడిలా వచ్చి కాపాడారు. మీ ఋణం ఎలా తీర్చుకోవాలి' అంటూ కృతజ్ఞతలు తెలిపారు. కానీ, ఎవరో వారి బంధువొకతను 'ఈయనే ఆక్సిడెంట్ చేసి ఉండకపోతే, డబ్బులుపెట్టి జాయిన్ చేసి, బ్లడ్ కూడా డొనేట్ చేస్తాడా' అంటూ పాయింట్ లేవదీసేసరికి వారి అనుమానపు చూపులు భరించలేకపోయాను శిరీ..డాక్టరే.."ఆక్సిడెంట్ చూస్తే తెలీటం లేదా..ఏదో భారీ



వాహనం గుద్దిపోయిందని. మీలాంటి వారు ఉండబట్టే ఆపదలో ఉన్నవారిని రక్షించడానికి అంతా వెనుకంజ వేస్తున్నారని' అనేసరికి నాకు క్షమాపణలు చెప్పి, నే పెట్టిన డబ్బులిచ్చి ఆటోలో ఎక్కించి మరోసారి కృతజ్ఞతలు చెప్పి వెళ్ళారు" అంటూ కళ్ళు మూసుకుని చెబుతున్న అతన్ని చూస్తున్న శిరీషకి దుఃఖం ఆగలేదు.

ఈరోజుల్లో ఒకరి బాధల్ని చూసి స్పందించే తీరిక, ఓపిక ఎవరికి ఉన్నాయి. పెరుగుతున్న నాగరికతా ప్రపంచంలో, అసలు మనుషుల మధ్య ఆత్మీయతానురాగాలే తరిగిపోతూ, ప్రేమానుబంధాలు, మనిషి మనిషికి మధ్య సంబంధాలే తెగిపోతున్న ఈరోజుల్లో ముక్కు, మొహం తెలియని ఒకరి బాధను, తన బాధగా స్వీకరిస్తూ, వారి కోసం రెండు కన్నీటి చుక్కలతో, నీకంటూ నేనున్నాననే మానసిక స్థైర్యం కలుగజేస్తూ, అండగా నిలవడమే గొప్పతనం. 'ఎవరెలా పోతే..నాకెందుకు లెద్దూ' అన్న సంస్కృతి నుండి, అంతా నా వారేనంటూ ఆపదల్లో వారిని ఆప్తుల్లా అక్కున చేర్చుకునే సంస్కృతికి అంతా ఎదిగిననాడు నిజంగా లోకమంతా నందనవనం కాదూ! సినిమాను చూసి ఏడుస్తున్నాడని ఆటపట్టించినా, ఇప్పుడనిపిస్తోంది, అలా ఒకరి కష్టాలకు స్పందించే హృదయం ఉండటం నిజంగా గొప్పతనమేనని. దేవుడా..చాలు తండ్రీ..ఈ జన్మకిది చాలు. ఇక ఏడేడు జన్మలకైనా, ఈయనే నా భర్తగా ఉండేట్లు ఆశీర్వదించు" అంటూ కన్నీళ్ళు జలజలా రాలుతుంటే, మురిపెంగా అతని నుదుటిపై కళ్ళపై ముద్దుపెట్టుకుని, చెపుతూ..చెబుతూ..ఇంకా ఆ షాక్ నుండి బయటపడనట్లు వణుకుతున్న అతన్ని గర్వంగా గుండెలకు హత్తుకుంది శిరీష 'నీకు నేను తోడున్నా'ననే మనోనిబ్బరాన్ని అందిస్తూ.